క్లుప్తంగా

వృద్ధురాలికి నిత్యావసరాల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులో నివసిస్తున్న నిరుపేద వృద్ధురాలు పందిరి లక్ష్మికి సంకల్ప సేవాసమితి సహకారంతో పట్టణానికి చెందిన సయ్యద్ కరిమూన్ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు వితరణ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు జిమ్ జానీ మాట్లాడుతూ సంకల్ప సేవా సమితి ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



శావల్యాపురం: స్థానిక రైల్వే స్టేషను వెళ్లే రహదారి మార్గంలో సీసీ డ్రైన్స్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుంచి నిలిచిపోయిన సమస్యకు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధి పథకం నిధులు రూ.10 లక్షల వ్యయంతో లింగాల వారి వీధిలో 170 మీటర్ల మేర ఇరువైపులా సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులు, అలాగే చౌదయ్య చికెన్ షాపు వెళ్లే రహదారి మార్గంలో 200 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. భూమి పూజలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి రవి, పొట్టిపాటి శ్రీను, ఏసురాజు, తోట రామ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి

–ఏవో ప్రవీణ్

శావల్యాపురం: రైతులు సాగు చేసిన ఆరుతడి పంటలు ఆశాజనకంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ అన్నారు. సోమవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల ద్వారా 518 మంది రైతులకు 3037 బ్యాగ్స్‌ను 40 శాతం రాయితీపై మంజూరు చేయగా ఇందుకుగాను రూ.18 లక్షల 35 వేలు నగదు రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. మండలంలో రబీ సీజనులో శనగ పంట 1417 ఎకరాలు పంట సాగు చేయగా అందులో అధికంగా మండలంలోని వేల్పూరు గ్రామంలో 1100 ఎకరాలు శనగ పంటను సాగు చేశారన్నారు. ఆయనతో పాటు. ఏఈవో పురేటి అశోక, వీపీఏ వెంకాయమ్మలు ఉన్నారు.

గణపవరంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సేవలు



నాదెండ్ల: ఇతర బ్యాంకులు డిపాజిట్లపై ఇస్తున్న వడ్డీ రేట్ల కన్నా తమ బ్యాంకు అత్యధికంగా వడ్డీ చెల్లిస్తుందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు చెప్పారు. గణపవరంలో 254వ శాఖను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న చిన్న కారు రైతులు బడుగు బలహీన వర్గాలకు చేయూతనిస్తూ గ్రామీణ బ్యాంకుల్లో తమ బ్యాంకు ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అన్ని రకాల రుణ సదుపాయాలతో పాటూ విద్యా రుణాలు, గృహ, తనఖా రుణాలు, భూమి కొనుగోలు రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులకు చైర్మన్ చేతుల మీదుగా కిసాన్ క్రెడిట్ కార్డులు అందించారు. కార్యక్రమానికి నరసరావుపేట రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ సభకు అధ్యక్షత వహించగా, బ్యాంకు మేనేజర్ ఎల్ భరత్ యాదవ్, క్యాషియర్ బి.కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మళ్లీ సీఎంగా జగనన్నే కావాలి

నరసరావుపేట: రాష్ట్రంలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి చేయాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మూడో వార్డు నిమ్మతోట, ఐదోవార్డు క్రిస్టియన్ పాలెం సచివాలయ పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలియచేస్తూ అమర్చిన డిస్‌ప్లే బోర్డుని ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో అధిక సంఖ్యలో టీడీపీ సానుభూతిపరులు ఉన్న సరే పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందజేశామన్నారు. మూడో వార్డులో రూ.16కోట్లతో సంక్షేమం, అభివృద్ధి, ఐదో వార్డులో రూ.25.50కోట్ల మేర సంక్షేమ లబ్ధి అందించామన్నారు..



శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిమకు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



నాదెండ్ల శివాలయంలో ఏర్పాటు చేసిన దీపోత్సవం



గణపవరం కోదండ రామాలయంలో శివలింగాకారంలో దీపాలంకరణ



నాదెండ్ల శివాలయంలో ఏర్పాటు చేసిన జ్వాలా తోరణం



నరసరావుపేటలో ప్రత్యేక అలంకరణలో కల్యాణ సుందరేశ్వర స్వామి

ఘనంగా కార్తిక పౌర్ణమి వేడుకలు

వినుకొండ (నూజెండ్ల): కార్తిక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పలుదేవాలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వేంచేసిన శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని స్వామివారికి విశేష పూల అలంకారాలు, ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా శివలింగం, వెంకటేశ్వరస్వామి వారి ప్రతిమలకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం అర్చకులు శ్రీనివాసులు శ్రావణ కుమార్ ఆధ్వర్యంలో దంపతులు పాల్గొని సామూహిక రమా సహిత శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య మాట్లాడుతూ డిసెంబరు 12న పోలీ స్వర్గం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అచ్యుత కృష్ణ సుబ్బారావు, కాళ్ల రామ కోటేశ్వరరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పాత శివాలయం వద్ద గల ప్రసన్న రామలింగేశ్వర కోదండ రామస్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా శివునికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొల్లిపర బాలసుబ్రహ్మణ్యం, పావనీదేవి, వెంకటేశ్వర్లు, సంపూర్ణమ్మ, తిరుమలమ్మ, కొండలురెడ్డి, వెంకటరత్నం, గుడివాడ గురునాథం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు దీపోత్సవం నిర్వహించారు. గణపవరం కోదండ నగర్‌లో కొలువైయున్న కోదండ రామాలయంలో భక్తులు శివలింగాకారంలో దీపోత్సవం నిర్వహించారు. గణపవరం గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ దీపాలతో అలంకరించారు. నాదెండ్ల శివాలయంలో అఖండ దీపారాధన, జ్వాలా తోరణం ఘనంగా జరిపారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.



కోటి దీపోత్సవంలో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వి.రెడ్డిపాలెం శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

యడ్లపాడులో...



సొలస లో ప్రత్యేక అలంకరణలో ప్రమిద జ్యోతులు



ఆంజనేయ స్వామి ఆలయంలో దీపాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్న భక్తులు

యడ్లపాడు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో విద్యుత్, దీపాలంకరణ చేశారు. సొలస గ్రామంలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి ఆలయం, బ్రహ్మంగారి గుడి, యడ్లపాడులోని ప్రపత్తి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని ఆది, సోమవారాలు రెండు రోజులు ప్రత్యేకంగా ప్రమిదలను ఏర్పాటు వెలుగులమయం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రంతా జాగారం చేసి మహాశివునికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా కోటి దీపోత్సవ ం

వినుకొండ(నూజెండ్ల): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి ఆలయంలో కోటి దీపోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చుండూరి శ్రీమన్నారాయణ, అర్చనామూర్తి ఆధ్వర్యంలో కోటీ దీప శివలింగ దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కోటి దీపోత్సవంలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న సేవలను ప్రశంసిస్తూ కమిటీ సభ్యులను అభినందించారు. నియోజకవర్గ ప్రజలకు ఆ శివుని ఆశీస్సులు సంపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం హిందూ కర్మల సత్రం నిర్మాణానికి రూ.12 లక్షలు విరాళం ఇచ్చిన భక్తుడు జయవరపు రామచంద్రరావు, ఆయన కుటుంబసభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని దేవాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు ఆలయాలలో కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పాతూరులోని శ్రీ భీమలింగేశ్వర ఆలయం, రావిపాడు రోడ్డులోని శ్రీ కళ్యాణ సుందరేశ్వర స్వామి ఆలయం, బరంపేట లోని వాయు మల్లేశ్వర స్వామి తదితర ఆలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు.

పాతూరి శివాలయంలో ఆదివారం రాత్రి కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని జ్వాలా తోరణం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. కాగా సోమవారం బరంపేటలోని శ్రీ పసన్నాంజనేయ స్వామి వారి కళ్యాణ మండపంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. వ్రతంలో 51 జంటలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మిట్టపల్లి చంద్రమోహన్, కొత్తూరు ప్రసాదరావు, చేగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విప్పర్లలో ప్రత్యేక అభిషేకాలు



విప్పర్ల శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

రొంపిచర్ల: మండలంలోని దేవాలయాలను కార్తిక పౌర్ణమి శుభ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలు చేశారు. విప్పర్ల శివాలయంలో స్వామి వారికి లక్షబిల్వార్చన, అన్నా తదితర అభిషేకాలు నిర్వహించారు. జ్వాలా తోరణం నిర్వహించారు. వి.రెడ్డిపాలెం శివాలయాల ఆవరణలో నిర్వహించిన కార్తిక పౌర్ణమి వేడుకల్లో శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. అలాగే వడ్లమూడివారిపాలెం, మాచవరం, కొత్తపల్లి, సంతగుడిపాడు, బుచ్చిబాపన్నపాలెం, పరగటిచర్ల, రొంపిచర్ల తదితర గ్రామాల్లోని దేవాలయాలలో కార్తిక పౌర్ణమి వేడుకలు జరిగాయి.

జగనన్న పథకాలు దేశానికి ఆదర్శం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- రావిపాడులో సబ్‌స్టేషన్ ప్రారంభం
- జొన్నలగడ్డలో త్రీఫేస్ పనులకు శ్రీకారం



రావిపాడులో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని రావిపాడు గ్రామంలో రూ.3 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ ద్వారా ఏడు గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో గతంలో 14 సబ్‌స్టేషన్‌లు ఉండగా నూతనంగా మరో నాలుగు సబ్‌స్టేషన్‌లు అందుబాటులోకి వచ్చినట్టు తెలిపారు. మరో రెండు సబ్‌స్టేషన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు. దీంతో పాటు రావిపాడు గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా కోసం మరో రూ.80 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. గత నాలుగున్నర సంవత్సరాల్లో రావిపాడు గ్రామంలో రూ.41 కోట్లు అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఖర్చుచేసినట్టు తెలిపారు. గ్రామంలో గతంలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. గ్రామంలో ఒకే చోట రెండు సచివాలయాలు, రెండు ఆర్‌బీకేలు, రెండు హెల్త్‌క్లినిక్‌లు, రెండు మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లను నిర్మించామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదు అని మాట్లాడే టీడీపీ నాయకులు రావిపాడు గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి కళ్లు తెరవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అనంతరం జొన్నలగడ్డ గ్రామంలో రూ.కోటితో చేపట్టనున్న త్రీఫేస్ విద్యుత్ సరఫరా పనులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూజలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా గ్రామంలో 300 విద్యుత్ స్తంభాలు మార్చడంతో పాటు 50 కిలోమీటర్ల నూతన ఎల్‌టి లైన్, 11 నూతన ట్రాన్స్‌ఫార్మర్స్‌ను ఏర్పాటుచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద ముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ వి.శ్రీనివాసరావు, ఏడీఈలు ఏడుకొండలు, వెంకటేశ్వరరెడ్డి, ఏఈలు సురేంద్ర, పవన్, రావిపాడు, జొన్నలగడ్డ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల కోసమే సంక్షేమ పథకాలు

- అందించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- నూజెండ్ల మండలం కొత్త ఉప్పలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేనివిధంగా అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం కొత్త ఉప్పలపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేశారు. అనంతరం గ్రామస్తులనుద్దేశించి ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతిఒక్క పేదవారికి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పరిపాలనను తీసుకొచ్చామని వలంటీర్ల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ఇంటింటికీ అందిస్తున్నామన్నారు. గ్రామాల్లోని సమస్యలు తెలియజేసిన వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు.

నూజెండ్ల మండలంలోని పువ్వాడ గ్రామ పరిధిలో ఎత్తిపోతల పథకంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. వినుకొండ మండలాన్ని కలుపుతూ ప్రకాశం జిల్లాకు రాకపోకల కోసం గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మించినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. వినుకొండ నియోజకవర్గాన్ని తనదైనశైలిలో అభివృద్ధి చేసి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండ నియోజకవర్గంలో నూతనంగా కళాశాలలు, కోల్డ్ స్టోరేజీలు, నూతన ఆసుపత్రుల నిర్మాణం, మున్సిపల్ స్టేడియం, ఘాట్ రోడ్డు నిర్మాణం, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వంటి అభివృద్ధి పనులతోపాటు అనేక పనులు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్నీ గ్రామాలల్లో అభివృద్ధి చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, సొసైటీ అధ్యక్షుడు పొట్లపల్లి పిచ్చిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తలారి ఆంజనేయులు, జెడ్పీకోఆప్షన్ గుండాల స్వెనోమ్, ఒంగూరి ప్రసాద్, గాదె నాగార్జునరెడ్డిలతో పాటు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిరప పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



బొల్లాపల్లి : మండలంలోని పేరూరుపాడు గ్రామంలోని మిరప పంట పొలాలను వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబి రసూల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల తామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎకరాకు 2000 కేజీల వేప పిండి భూమిలో వేయాలని తెలిపారు. దీని వలన తామర పురుగు కోశస్థ దశలను నియంత్రించవచ్చని చెప్పారు. పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు వాటితో పాటు 10000 పీపీఎం వేప నూనెను ఒక లీటర్‌కు రెండు మిల్లీ లీటర్లు చొప్పున కలుపుకొని పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పేరూరుపాడు వ్యవసాయ సహాయకులు రంగనాయక్, మిరప రైతులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు

యడ్లపాడు: కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని అర్జీలను ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలో డిసెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూతు లెవల్ అధికారులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి ఈ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గణపవవరం ఎన్‌సీసీ అధికారి రసూల్‌కు అవార్డు



నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారిగా పనిచేస్తున్న షేక్ మహమ్మద్ రసూల్‌కు ఉత్తమ టీమ్ లీడర్‌గా అవార్డు అందుకున్నారు. ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ గ్రూప్ గుంటూరు కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ నుంచి ఎన్‌సీసీ డే సందర్భంగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈయన క్రమశిక్షణ, నైతిక విలువలు, నాయకత్వం, బాధ్యతల నిర్వహణ వంటి అంశాలపై ఉమ్మడి గుంటూరు జిల్లాలో పది మందికి అవార్డులు దక్కాగా, నాదెండ్ల మండల పరిధిలో గణపవరం జెడ్పీ హైస్కూలుకు రావటం అభినందనీయమని హెచ్ఎం ఐ కృష్ణానాయక్, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

ఆలయ కళాప్రకర్షణ పనులు ప్రారంభం



దేవతా విగ్రహాలను బాలాలయానికి చేరుస్తున్న భక్తులు

నాదెండ్ల: మండలంలోని తూబాడు గ్రామంలో కొలువైయున్న శ్రీ భూ నీళా సమేత శ్రీ చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానాల కళాప్రకర్షణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. 250 ఏళ్ల నాటి ఈ దేవాలయం శిథిలావస్థకు చేరటంతో ప్రభుత్వం దేవాదాయ శాఖ నుంచి రూ.1కోటి నిధులను మంత్రి విడదల రజిని విడుదల చేయించారు. దీంతో జీర్ణోద్ధరణ పనులు సోమవారం నుంచి మూడు రోజుల పాటూ జరగనున్నాయి. తొలిరోజు సోమవారం భగవదనుజ్ఞ, ప్రార్థనా సూక్తపఠనం, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధణ, ప్రాశన, అర్చనలు, నివేదన, అగ్నిప్రతిష్ఠ ప్రారంభమయ్యాయి. అనంతరం పత్తిపాడుకు చెందిన బృందావనం ఆదిత్యా నరసింహాచార్యుల ఆధ్వర్యంలో శాంతి హోమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు దగ్గుమల్లి హరిగోపాలం, ఎంవీ కోటిరెడ్డి, సుబ్బారావు, చెన్నుపాటి నాగేశ్వరరావు, రఘురాం దంపతులు పీటలపై కూర్చుని శాంతిహోమాలు, పూజలు నిర్వహించారు. విగ్రహాలకు పూజల అనంతరం ఈ నెల 29న అదే ప్రాంగణలో ఏర్పాటు చేసిన బాలాలయంలో ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

ఆడుదాం ఆంధ్రకు పేర్లు నమోదు చేసుకోండి



వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీవో వై హనుమారెడ్డి, మాధురిరాణి

యడ్లపాడు: 'ఆడుదాం ఆంధ్ర' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఆటల పోటీలకు ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఉన్నవ జెడ్పీ హైస్కూల్ పీడీ, స్పోర్ట్స్ అథారిటీ మండల కో–ఆర్డినేటర్ మాధురిరాణి చెప్పారు. సోమవారం వారు మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో పోటీల్లో పాల్గొనే వారికి రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. కబడ్డీ, ఖో–ఖో, బాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది మినహా 15 ఏళ్లు నిండిన క్రీడాకారులు ఎవరైనా ఈ ఆటల పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. సచివాలయ స్థాయిలో డిశంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు, మండలస్థాయిలో 21 నుంచి 2024 జనవరి 4వ తేదీ వరకు, నియోజకవర్గస్థాయి 5 నుంచి 10 వరకు, జిల్లాస్థాయిలో 11 నుంచి 21 వరకు, రాష్ట్రస్థాయి 22 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయి పోటీలకు కొనసాగుతాయని వివరించారు.